సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 14 । మార్చి । 2024






### మానసిక క్షోభ వల్లే
మానసిక క్షోభ వల్లే గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిందని మంత్రి కారుమూరి విచారం వ్యక్తం చేశారు. గీతాంజలి మృతిపై జిల్లాలో పలు చోట్ల నిరసనలు జరిగాయి. 8లో ▸



### మోటార్ సైకిళ్ల దొంగల అరెస్టు
మోటార్ సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు యువకులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 25 లగ్జరీ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸




## న్యూస్‌రీల్

### జగనన్న ప్రభుత్వానికి పట్టం కట్టండి



జగన్నాథపురం సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు

**పోడూరు:** రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి సీఎం జగనన్న ప్రభుత్వానికి పట్టం కట్టాలని ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు పిలుపునిచ్చారు. జగన్నాథపురంలో బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సుమారుగా రూ.72 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో గ్రామాల అభివృద్ధి జోరుగా సాగుతోందన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో అన్ని గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించామన్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' ద్వారా ఇంటింటి పర్యటనలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి గ్రామాల్లో అవసరమైన చోట్ల రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, గ్రామ సర్పంచ్ గుడాల శిరీష చంటి, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఎంపీటీసీ సభ్యులు దిద్దే అఖిల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

### తొలి తెలుగు కవయిత్రి మొల్ల
**భీమవరం (ప్రకాశంచౌక్):** తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల చిరస్మరణీయులని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల జయంతిని నిర్వహించారు. తొలుత మొల్ల చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, బీసీ సంక్షేమాధికారి జి.గణపతిరావు పాల్గొన్నారు.

### జేసీగా సీవీ ప్రవీణ్ ఆదిత్య
**భీమవరం (ప్రకాశం చౌక్):** జిల్లా జాయింట్ కలెక్టర్‌గా సీవీ ప్రవీణ్ ఆదిత్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఈవీఎం గోదాముల తనిఖీలో ఉన్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం కలెక్టర్ ఈవీఎం గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాం వద్ద విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గార్డులకు పలు సూచనలను చేశారు. ఇన్‌చార్జి డీఆర్వో బి.శివనారాయణ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, డీటీ ఎం.సన్యాసిరావు ఉన్నారు.

### పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ అజిత వేజెండ్ల

**భీమవరం (ప్రకాశంచౌక్):** జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లను చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 84,324 ఓటరు కార్డులను పోస్టల్ ద్వారా పంపిణీ చేశామని, ఇంకా 1 లక్ష పదివేల ఓటరు కార్డులను ముద్రించనున్నట్లు తెలిపారు.

**పోలింగ్ నిర్వహణపై శిక్షణ**

ఎన్నికలపై పొందిన శిక్షణలో గ్రహించిన మెలకువలతో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో మాస్టర్ ట్రైనర్స్‌కు నిర్వహించిన శిక్షణలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో శిక్షణ ఎంతో కీలకమైందన్నారు. శిక్షణలో అన్ని అంశాలపై అవగాహన పెంచుకుంటేనే ఎన్నికల నిర్వహణ సులువుగా ఉంటుందన్నారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా శిక్షణ నోడల్ అధికారి కేసీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

**ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి**

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఉండి అసెంబ్లీ నియోజకవర్గం సెక్టార్ అధికారులకు బుధవారం సార్వత్రిక ఎన్నికల శిక్షణ తరగతులను నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సెక్టార్ అధికారులు తరచూ బూత్ లెవెల్ అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు., ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు.

# సాగులో రైతులకు తోడుగా..

**వ్యవసాయానికి ఉచిత విద్యుత్** అందిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రైతులకు అండగా నిలిచారు. గత ప్రభుత్వంలో రాత్రి వేళల్లో అదీ అరకొరగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడం వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. వీటిని గమనించిన సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం ద్వారా నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో సాగులో రైతులు లాభాల బాట పట్టారు.

**వ్యవసాయం పండగే**
- వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులకు ఉచితంగా వ్యవసాయ విద్యుత్
- పగటి పూట నిరంతరాయంగా 9 గంటల సరఫరా అమలు
- గడచిన ఐదేళ్లలో 5658.37 మిలియన్ యూనిట్ల వినియోగం
- దీని నిమిత్తం ప్రభుత్వం భరించిన మొత్తం రూ.354.47 కోట్లు
- ప్రతి ఏటా వేలల్లో పెరిగిన వ్యవసాయ విద్యుత్ సర్వీసులు
- విద్యుత్ చార్జీల బాధ లేకపోవడంతో సాగులో లాభాల బాట



మెట్ట ప్రాంతంలో ఉచిత విద్యుత్ సౌకర్యంతో భూగర్భ జలాలను తోడుతున్న పంపుసెట్

**ఉమ్మడి జిల్లాలో రైతుల విద్యుత్ వినియోగం, విద్యుత్ సంస్థకు ప్రభుత్వం చెల్లించిన సొమ్ము వివరాలు**

| సంవత్సరం | విద్యుత్ (మిలియన్ యూనిట్లలో) | చెల్లించిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2019–20 | 894.76 | 54.58 |
| 2020–21 | 1148.39 | 71.19 |
| 2021–22 | 1364.25 | 84.58 |
| 2022–23 | 1217.28 | 77.90 |
| 2023–24 | 1033.69 | 66.20 |
| మొత్తం | 5658.37 | 354.47 |

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** గత టీడీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యవసాయమంటేనే గిట్టేది కాదు. వ్యవసాయం దండగ అంటూ సాఫ్ట్‌వేర్ రంగంపైనే దృష్టిపెడుతున్నానంటూ ప్రజలను మోసగించడం చూశాం. వ్యవసాయానికి గతంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ ఇవ్వడంతో చంద్రబాబు కూడా ఇవ్వక తప్పలేదు. దీంతో ఉచిత విద్యుత్ ఇస్తున్నామంటూ రాత్రి 11 గంటలకో, తెల్లవారుజామున 3 గంటలకో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసేవారు. అప్పట్లో రైతులు చీకట్లో తాకరాని వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురై చనిపోవడమో లేక వ్యవసాయ క్షేత్రాల్లో సంచరించే పాములు, తేళ్ళు వంటి విష పురుగులు కుట్టి చనిపోతుండేవారు. రైతుల బాధలను గ్రహించిన జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత వ్యవసాయం కోసం ఉచితంగా సరఫరా చేసే విద్యుత్‌ను పగటి పూటే 9 గంటల పాటు నిరంతరాయంగా సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్ తీసుకున్న ఈ నిర్ణయంతో రైతులు కంటి నిండా నిద్రపోతూ, ఎటువంటి విద్యుత్ ప్రమాదాలకు, పాముకాట్లకు గురికాకుండా వ్యవసాయాన్ని పండుగ వాతావరణంలో చేసుకుంటున్నారు.

**రైతు బాగుంటేనే..** రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్. రైతుల అభివృద్ధి కోసం తపిస్తూ.. నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడం నుంచి సకాలంలో ఎరువులు సబ్సిడీ ధరలకు అందించడం, పంటలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకువచ్చారు. అక్కడితో వదిలేయకుండా ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మద్దతు ధర కల్పించడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తడిసి పాడైన పంటను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయడం, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి దాని ద్వారా అనేక రైతు సహాయక కార్యకలాపాలు నిర్వహించడం వంటి గతంలో కనీవినీ ఎరుగని వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు ముఖ్యమంత్రి జగన్ ప్రవేశపెట్టినవే.

**పూర్తి స్థాయిలో వినియోగం :** వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వైఎస్ జగన్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసింది. గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం జిల్లాలోని రైతులకు అందించిన ఉచిత విద్యుత్‌ను రైతులు పూర్తి స్థాయిలో వినియోగించుకుని సాగులో ఆశించిన దిగుబడి సాధించడంతో పాటు మద్దతు ధరకే తమ ఉత్పత్తులను అమ్ముకుని లాభపడ్డారు. ఈ ఐదేళ్ళ కాలంలో జిల్లాలో రైతులు మొత్తం 5658.37 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించుకోగా, దీని నిమిత్తం ప్రభుత్వం మొత్తం రూ.354.47 కోట్లను భరించింది.

### అర్హులందరికీ ఉచిత సర్వీసులు



జిల్లాలో ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించి అడిగిన వారందరికీ లేదనకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సర్వీసులు మంజూరు చేస్తున్నాం. గడిచిన ఐదేళ్లలో 7,836 మంది రైతులకు కొత్తగా విద్యుత్ సర్వీసులు మంజూరు చేసి వారికి కూడా ఉచిత విద్యుత్ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకున్నాం. వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా 9 గంటల పాటు విద్యుత్ అందించడానికి తగిన ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు సిద్ధం చేశాం.

– పి.సాల్మన్‌రాజు, ఎస్ఈ, ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్

### పారదర్శకంగా అనుమతులు
గత ప్రభుత్వాలు ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పినా కొంతమంది అనర్హులుగా, మరికొంత మందికి ఇతర కారణాలు చూపి లబ్ధిదారులను భారీ స్థాయిలో తగ్గించాయి. ఉచిత విద్యుత్ ఇచ్చిన వారికి కూడా అర్థరాత్రో, అపరాత్రో ఇవ్వడం, అది కూడా 9 గంటలు కాకుండా ఆరేడు గంటలే ఇవ్వడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేసేవారు. సాధారణంగా ఏ ప్రభుత్వమైనా ప్రజలకు ఉచితంగా ఇచ్చే ఏ పథకంలోనైనా లబ్ధిదారులను తగ్గించుకునే ప్రయత్నం చేస్తుంది. గత ప్రభుత్వాలు పింఛను, రేషన్ కార్డు లబ్ధిదారులను, ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారులను తొలగించడం వల్ల అర్హులైన లబ్ధిదారులు ఆయా సంక్షేమ పథకాల లబ్ధికి దూరమవడం చూసేవాళ్ళం. కానీ ముఖ్యమంత్రి జగన్ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాల్సిందే అని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో గతంలో కంటే ఈ ప్రభుత్వంలో అన్ని సంక్షేమ పథకాల్లో లబ్ధిదారులు ఏటేటా పెరుగుతూనే వచ్చారు. అలాగే ఉచిత విద్యుత్ వినియోగించుకునే రైతులు కూడా ఏడాదికి వేల సంఖ్యలోనే పెరిగారు. ఎవరు దరఖాస్తు చేసుకున్నా వారు అర్హులైతే వారికి వెంటనే విద్యుత్ సర్వీసును మంజూరు చేసి విద్యుత్ సరఫరా చేయడంలో అధికారులు తక్షణ చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో 2019–20 సంవత్సరంలో 96829 మంది ఉన్న సర్వీసుల సంఖ్య 2020–21 సంవత్సరానికి 1479 పెరిగి 98308కి చేరుకుంది. అలాగే 2021–22 సంవత్సరంలో 1145 సర్వీసులు, 2022–23లో 2428 సర్వీసులు, 2023–24లో 2784 సర్వీసులకు పెరగగా, మొత్తం 1,04,665 సర్వీసులు ఉన్నాయి.

# ప్రజాపక్షం.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు శంకుస్థాపన పూజ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- తాడేపల్లిగూడెంలో రూ.8.64 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

**తాడేపల్లిగూడెం అర్బన్:** వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజాపక్షం అని, ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు, సంక్షేమం అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణ అభివృద్ధిలో భాగంగా ఆయా వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.8.64 కోట్ల విలువైన 44 పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు బుధవారం నిర్వహించారు. వీటితోపాటు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎరువుల నాణ్యత పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎరువుల పరీక్షా కేంద్రానికి రాష్ట్రంలోని అని జిల్లాల నుంచి ఎరువుల పరీక్షకు ఇక్కడకే తరలిస్తారని తెలిపారు. అదేవిధంగా పట్టణ అభివృద్ధిలో భాగంగా ఇటీవల నూతనంగా నిర్మించిన నల్లజర్ల నాలుగు లైన్ల రోడ్డుకు సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు ప్రారంభ పూజలు నిర్వహించారు. అనంతరం ఒకటో వార్డులోని రాళ్ళసాహెబ్ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 3, 6, 11 వార్డులలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. వార్డుబాటలో తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించామన్నారు. సీఎం వైఎస్ జగన్ సహకారంతో రూ.వందల కోట్ల నిధులతో పట్టణాన్ని అభివృద్ధి చేశానన్నారు. తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నిర్మాణం తలపెట్టిన భూగర్భ డ్రెయినేజీ 1వ పట్టణంలో నిర్మాణం పూర్తికావచ్చిందన్నారు. ఎస్‌టీపీ ప్లాంటు నిర్మాణం చివరిదశలో ఉందన్నారు. మరికొన్ని రోజుల్లో భూగర్భ డ్రెయినేజీ ప్రారంభిస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు, కొట్టు విశాల్, సంపతరావు కృష్ణారావు, చెన్నా జనార్దన్‌రెడ్డి, కైకాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ పాల్గొన్నారు.

# ఆరిమిల్లికి ప్రజలే గుణపాఠం చెబుతారు

- కోర్టు కేసులతో వేల్పూరులో అభివృద్ధిని అడుకోవడం తగదు
- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- వైఎస్సార్ సీపీ నాయకుల రిలే దీక్షలకు సంఘీభావం



వేల్పూరు రిలే దీక్షలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

**తణుకు టౌన్:** రాజకీయాల కోసం పుట్టిన గ్రామంపైనే పగబట్టి అభివృద్ధిని అడ్డుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు త్వరలోనే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం తణుకు రూరల్ మండలం వేల్పూరులో రూ.6 కోట్లతో నిర్మించే 30 పడకల ఆసుపత్రిని వేల్పూరు పంచాయతీకి చెందిన నలుగురు సభ్యులు కోర్టులో కేసులు వేసి అడ్డుకోవడాన్ని నిరసిస్తూ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని మంత్రి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు వేల్పూరులోని పేదల పట్ల వివక్షతోనే వ్యవహరిస్తున్నారన్నారు. 2009లో మొదటిసారిగా గ్రామంలోని 398 మంది పేదలకు ఇళ్ల స్థలాలకు కోసం భూసేకరణ చేస్తే అప్పుడు కోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారన్నారు. 2019లో మరలా గ్రామంలోని 1300 మంది పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూసేకరణ చేస్తే గ్రామంలోని రైతులను బెదిరించి ప్రభుత్వానికి భూములను అమ్మకుండా అడ్డుకున్నారన్నారు. 2015లో తణుకు ప్రభుత్వ కళాశాలలో మహాత్మాగాంధీ దండీ మార్చ్ విగ్రహాలను షాపుల పేరుతో తొలగించారని చెప్పారు. 2020లో వేల్పూరులో ఐదు బీసీ కులాలకు సామాజిక అవసరాల కోసం నిర్మించే కమ్యూనిటీ హాళ్లను కోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారన్నారు. ఇప్పుడు గ్రామ పంచాయితీ స్థలంలో గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేస్తుంటే పంచాయతీ సభ్యులతో కోర్టులో కేసులు వేయించారన్నారు. ఇప్పుడు కూడా షాపుల నిర్మించాలనే ఉద్దేశంతోనే కేసులు వేయడం దారుణమన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు, పార్టీ అత్తిలి అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, వేల్పూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీలు చంద్రు శ్యామల, విజయ దుర్గ, పాలా వెంకట దుర్గ, సర్పంచ్‌లు పాలా శ్రీను, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల నియామకం



దాట్ల సుందర రామరాజు, డాక్టర్ల వింగ్ కమిటీ, జిల్లా అధ్యక్షుడు



మారోజు వెంకట గణేష్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు



చిన్నం సురేష్, స్టూడెంట్ వింగ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు

**భీమవరం:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ కమిటీలను నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలిచ్చింది. జిల్లాకు నూతనంగా నియమితులైన డాక్టర్స్, స్టూడెంట్, ఉపాధ్యాయ కమిటీ సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి.

**జిల్లా డాక్టర్ల వింగ్ కమిటీ**

అధ్యక్షునిగా దాట్ల సుందర రామరాజు (తణుకు), ఉపాధ్యక్షుడిగా సరెళ్ల వీరతవ (తణుకు) నియమితులయ్యారు. జనరల్ సెక్రటరీలుగా బీఆర్‌కే భాస్కరరావు (తణుకు), ఆకుల భాస్కరరావు (తాడేపల్లిగూడెం), పట్నాల సత్య శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), యు.వెంకటరావు (తాడేపల్లిగూడెం), సెక్రటరీలుగా విల్లారి సంపత్ (తణుకు), కండిబోయిన సత్యనారాయణ (తణుకు), యనకంటి వెంకట సుబ్బారావు (తాడేపల్లిగూడెం), వెందుర్తి సూర్యప్రకాష్ (తాడేపల్లిగూడెం), పుట్టి వెంకటేశ్వరరావు (తాడేపల్లిగూడెం), జాయింట్ సెక్రటరీలుగా షేక్ మాబు (తణుకు), వై.విజయ మహాలక్ష్మి (తణుకు), కూచిపూడి వెంకట సత్యనారాయణ (తాడేపల్లిగూడెం), కొయ్యల శ్రీనివాస్ (తణుకు) నియమితులయ్యారు.

**జిల్లా వైఎస్సార్‌టీయూసీ కమిటీ**

అధ్యక్షుడిగా మారోజు వెంకట గణేష్ (భీమవరం), ఉపాధ్యక్షులుగా వెంకట తాతాజీ (భీమవరం), బింకం అనిల్ చక్రవర్తి (తణుకు) నియమితులయ్యారు. జనరల్ సెక్రటరీలుగా గెద్దం బాబ్జీ (తాడేపల్లిగూడెం), బొమ్మిడి రాజేష్ (నర్సాపురం), అన్నాబత్తుల వీరాస్వామి (తణుకు), మానేపల్లి సత్తిరాజు (భీమవరం), కొండేటి భవాని ప్రసాద్ (ఆచంట), గంగుల సత్యనారాయణ (పాలకొల్లు), అందే రాజబాబు (ఉండి), సెక్రటరీలుగా యర్రా కేశవరావు (ఉండి), శేషాద్రి సత్యనారాయణ (ఉండి), శీలం వీరబాబు (పాలకొల్లు), జోగి ఈశ్వరరావు (పాలకొల్లు), పంపన గోపి (భీమవరం), పెచ్చెట్టి శ్రీను (ఆచంట), జలాది అచ్యుతరావు (తాడేపల్లిగూడెం), ఏలూరి కుమార రత్నం (నర్సాపురం), గోడి నాగబాబు (తణుకు), అలుగోజి మచ్చకృష్ణ (తణుకు), మాత వినయ్ కుమార్ (ఆచంట), యూవీఎస్ సత్యనారాయణ (భీమవరం), గ్రంధి శ్రీనివాస్ (భీమవరం), ఎరువల రాము (భీమవరం), కొల్ల నాగేశ్వరరావు (పాలకొల్లు), గెద్దం త్రిమూర్తులు (తాడేపల్లిగూడెం), ఎం.వెంకన్నబాబు (తాడేపల్లిగూడెం), కె.చంద్రరావు (తణుకు), వై.అరుణ్ కుమార్ (భీమవరం), బోధనపు కన్నయ్య (ఉండి), ఎస్.వెంకటాచార్యులు (ఉండి) నియమితులయ్యారు.

**జిల్లా స్టూడెంట్ వింగ్ కమిటీ**

అధ్యక్షుడిగా చిన్నం సురేష్ (తాడేపల్లిగూడెం), ఉపాధ్యక్షులుగా వి.టోని (ఉండి), సీహెచ్ సత్యనారాయణ రెడ్డి (ఆచంట) నియమితులయ్యారు. జనరల్ సెక్రటరీలుగా జి.ఎడ్వర్డ్ పాల్ (తణుకు), ఇనపర్తి రాహుల్ (పాలకొల్లు), వీరవల్లి గుణ శేఖర్ (భీమవరం), ముప్పిడి జెస్సీ (తాడేపల్లిగూడెం), పి.సంజయ్ బాబు (నర్సాపురం), జి.డానియల్ జాషువా (ఉండి), బి.మారుతీ రావు (ఆచంట), సెక్రటరీలుగా కె.మానోజ్ (తాడేపల్లిగూడెం), కె.ఏసు (తాడేపల్లిగూడెం), వి.ఆకర్ష్ బాబు (తణుకు), పి.వెంకట సాయి (తణుకు), జి.మణికంఠ (నర్సాపురం), ఐ.కోమల్ రెడ్డి (నర్సాపురం), ఎం.ప్రవీణ్ (పాలకొల్లు), కె.సురేష్ కుమార్ (పాలకొల్లు), పి.రాజేష్ (ఉండి), బండి మధు (ఉండి), కె.సాయి కుమార్(ఆచంట), జి.వెంకట మురళి (ఆచంట), కె.సోమరాజు (భీమవరం), ఎస్.శివ వీర భద్రరావు (భీమవరం), జాయింట్ సెక్రటరీలుగా జి.సాయి చిరంజీవి (తాడేపల్లిగూడెం), కె.మున్నా (తాడేపల్లిగూడెం), జి.కృష్ణా రెడ్డి (తణుకు), బి.వినయ్ కుమార్ (తణుకు), బి.జోసఫ్ రాహుల్ (భీమవరం), బి.జాని (భీమవరం), ఈ.అనిల్ (నర్సాపురం), పి.రంజిత్‌కుమార్(నర్సాపురం), బి.సాల్మన్ ఆదిత్య (ఉండి), జి.గణేష్ (ఉండి), కె.గంగాధర్ (ఆచంట), సీహెచ్ మహేష్ (ఆచంట), ఎస్.సత్యనారాయణ (పాలకొల్లు), కె.సురేష్ కుమార (పాలకొల్లు) నియమితులయ్యారు.

# జనసేనలో అసమ్మతి పవనాలు

## ఉమ్మడి పశ్చిమలో జనసేన అభ్యర్థుల ఖరారు!

**సాక్షి ప్రతినిధి, ఏలూరు:** ఎట్టకేలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన అభ్యర్థులు ఖరారైనట్టు సమాచారం. బుధవారం పవన్‌కళ్యాణ్ అభ్యర్థులతో సమావేశం నిర్వహించి బీ–ఫామ్, ఎన్నికల నియామవళి విధి విధానాలు, అనుమతి పత్రాలు అందజేశారు. భీమవరం నుంచి పవన్‌కళ్యాణ్ పూర్తిగా తప్పుకున్నారు. నియోజకవర్గాల వారీగా నరసాపురం నుంచి బొమ్మిడి నాయకర్, తాడేపల్లిగూడెం నుంచి బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరు నుంచి పత్సమట్ల ధర్మరాజు, భీమవరం నుంచి పులపర్తి రామాంజనేయులు సమావేశానికి హాజరై పత్రాలు తీసుకుని అభ్యర్థులుగా ఖరారయ్యారు. తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి శ్రీనివాస్ ర్యాలీ, సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుల్లో భాగంగా జనసేనకు ఉమ్మడి పశ్చిమలో నిడదవోలుతో కలిపి ఆరు సీట్లు కేటాయించారు. పోలవరం అభ్యర్థిత్వంపై జనసేనకు స్పష్టత లేకపోవడంతో పెండింగ్‌లో ఉంది.

**జంపింగ్ నేతకు భీమవరం టికెట్**

కాంగ్రెస్ పార్టీలో రాజకీయం ప్రారంభించి ఒకసారి ఎమ్మెల్యేగా చేసి వెంటనే టీడీపీలో చేరి మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచిన భీమవరం మాజీ ఎమ్మెల్యే, జంపింగ్ నేత పులపర్తి రామాంజనేయులుకు భీమవరం టికెట్ కేటాయించారు. 2019లో పవన్‌కళ్యాణ్ పోటీ చేసి ఓటమి పాలైనప్పటి నుంచి మళ్లీ భీమవరంలోనే పోటీ చేస్తానని పలుమార్లు ప్రకటించి చివరకు జిల్లా నుంచి జారుకున్నారు. అంతటితో ఆగకుండా పార్టీ ఆవిర్భావం నుంచి జనసేనలో ఉన్న వారికి కాదని రెండు రోజుల క్రితం పార్టీలో చేరిన రామాంజనేయులకు టికెట్ ఇవ్వడంపై జనసేన కేడర్‌లో అసమ్మతి మొదలైంది. గత వారమే రామాంజనేయులకు టికెట్ ఇస్తారని ప్రచారం జరిగిన క్రమంలో భీమవరం జనసేన కార్యకర్తలు ప్రొడ్యూసర్ బన్నీ వాసును కలిసి రామాంజనేయులకు టికెట్ ఇవ్వవద్దని కలిసి చెప్పారు. ఇక రామాంజనేయులు అభ్యర్థిత్వం ఖరారు కావడంతో పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న నేతల్లో అసహనం మొదలైంది. సాధారణంగా పార్టీలు అభ్యర్థులను ప్రకటిస్తాయి, అయితే ఇక్కడ మాత్రం అభ్యర్థులు వారికి వారే ప్రకటించుకున్నట్లు తెలిసింది.

## క్లుప్తంగా

### అయ్యో 'పాప'ం
**చెత్తకుండీలో ఆడ శిశువు మృతదేహం**



పసికందు మృతదేహం

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** తాడేపల్లిగూడెంలోని శేషమహల్ థియేటర్ వెనుక భాగంలో 7వ వార్డు సచివాలయం సమీపంలో చెత్త కుండీలో ఐదు రోజులలోపు పసికందు (ఆడ శిశువు) మృతదేహం బుధవారం కనిపించింది. మానవత్వం మరచి సభ్యసమాజం తలదించుకునేలా పసికందును కవరులో పెట్టి మున్సిపల్ చెత్త కుండీ వద్ద పారేశారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై సుధాకర్ రెడ్డి పసికందు మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్సై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం శిశువు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### తెలంగాణ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా వీరవాసరం వాసి



వీరవల్లి కనకరత్నం

**వీరవాసరం :** వీరవాసరం గ్రామానికి చెందిన వీరవల్లి కనకరత్నంను తెలంగాణలో రాష్ట్రస్థాయి కొలువైన ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా నియమించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్టు కనకరత్నం తెలిపారు. కనకర్నతం ప్రాథమిక, ఇంజనీరింగ్ విద్య వీరవాసరం, భీమవరంలో పూర్తిచేశారు. ఏపీపీఎస్సీ ద్వారా జోన్-6 నుంచి ఏఈఈగా నియమితులై అప్పటి నుంచి తెలంగాణ కేడర్‌లో కొనసాగుతున్నారు. డీఈ, ఈఈ, సూపరింటెండెంట్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్‌గా ఎదిగారు. ప్రస్తుతం నిజామాబాద్ జోన్‌లో విధులు నిర్వర్తిస్తున్న తరుణంలో తెలంగాణ ప్రభుత్వం ఆయన్ను ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా నియమించింది.

### నన్నయ వర్సిటీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**తాడేపల్లిగూడెం:** ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం ప్రాంగణంలో బుధవారం సీసీ రోడ్లు, డ్రైయిన్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వైస్ ఛాన్సలర్ పద్మరాజు, ప్రొఫెసర్‌లు జి.సుధాకర్, టి.అశోక్, నూకరత్నం మాట్లాడారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిని ప్రస్తావించారు. విశ్వ విద్యాలయం అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్షలకు 97 శాతం హాజరు

**భీమవరం:** జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ పరీక్షలకు 97 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. 14,512 మంది జనరల్ విద్యార్థులకు 14,099 మంది, 1,408 ఒకేషనల్ విద్యార్థులకు 1,319 మంది హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

# ఎంత మానసిక క్షోభ అనుభవించావో అమ్మా..!

- గీతాంజలి మృతిపై వెల్లువెత్తిన నిరసనలు
- తణుకులో మహిళల నిరసనకు మంత్రి కారుమూరి సంఘీభావం
- బాధ్యులను శిక్షించాలని డిమాండ్

**తణుకు అర్బన్:** తన ఇద్దరు కుమార్తెలను వదిలి గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిందంటే.. ఆమె ఎంత మానసిక క్షోభ అనుభవించిందో అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విచారం వ్యక్తం చేశారు. గీతాంజలి ఆత్మహత్యకు అంజలి ఘటిస్తూ తణుకు నరేంద్ర సెంటర్‌లో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నిరసన తెలిపింది. ఈ కార్యక్రమానికి మంత్రి కారుమూరి సంఘీభావం తెలిపి మాట్లాడారు. తనకు సొంతిల్లు వచ్చిందని.. జగనన్న తన కల నెరవేర్చాడని తెనాలికి చెందిన గీతాంజలి ఒక యూట్యూబ్ చానల్‌కు ఎంతో భావోద్వేగంతో తెలిపిన తీరును ప్రజలంతా స్వాగతించారని, అది ఓర్వలేని టీడీపీ పచ్చ దొంగలు ఆమెపై సామాజిక మాధ్యమాల్లో విషం చిమ్మటమే కాకుండా అసభ్యకరంగా పెట్టిన పోస్టులకు చలించి ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గీతాంజలి విషయంలో స్పందించి ఆమె కుటుంబానికి రూ.20 లక్షలు ఆర్థిక సాయంతోపాటు అండగా నిలబడతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో ఐటీడీపీ పేరుతో పెడుతున్న పోస్టులు ఎంతోమంది జీవితాలను చిదిమేస్తున్నాయని గీతాంజలి ఒక్క విషయమే బయట పడిందని చెప్పారు. ఒక మహిళ ప్రభుత్వం వలన తనకు జరిగిన మంచిని చెప్పుకోవడం వలన ఇలా జరిగిందంటే ప్రతిపక్షాలన్నీ సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. ముందుగా గీతాంజలి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పార్టీ అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి రాము, తణుకు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొట్ల సురేష్, ఉండవల్లి జానకి, ఝాన్సీ లారెన్స్, ఉంద్రాజవరపు గీత, ఎం.లలిత, ఫహీమా, కొఠారు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**టీడీపీ, జనసేనవి నీచ రాజకీయాలు**

**బుట్టాయగూడెం:** ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ టీడీపీ, జనసేన పార్టీలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి తీవ్రంగా విమర్శించారు. బుట్టాయగూడెంలో బుధవారం జరిగిన నాలుగో విడత చేయూత కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియాలో ప్రతిపక్ష టీడీపీ, జనసేన మద్దతుదారులు వేధింపులు, ట్రోల్స్‌ను తట్టుకోలేక గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిందని, ఇది చాలా బాధాకరమైన విషయమని అన్నారు. గీతాంజలి మరణానికి కారణమైన వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఆత్మహత్యలకు పాల్పడడం వల్ల భర్త, పిల్లలు అన్యాయమైపోతారని అన్నారు. ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలకు స్వస్తి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం గీతాంజలి మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

**నడిపల్లిలో రాస్తారోకో**

**పెదవేగి :** గీతాంజలిది ఆత్మహత్య కాదని టీడీపీ, జనసేన సోషల్‌మీడియా చేసిన హత్యగా పరిగణించి కారకులైన ప్రతి ఒక్కరినీ కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గొట్టేటి స్టాలిన్ డిమాండ్ చేశారు. బుధవారం పెదవేగి మండలం నడిపల్లిలో గీతాంజలి మృతికి నిరసనగా రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఉక్కుర్తి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు ఎం. గోపాలరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రాఘవాపురంలో ర్యాలీ**

**చింతలపూడి:** గీతాంజలి మృతికి కారణమైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా కార్యకర్తలను తక్షణం అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సొసైటీ చైర్మన్ గిరి భోగారావు డిమాండ్ చేశారు. బుధవారం చింతలపూడి మండలంలోని రాఘవాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ పడమటి ఎస్సీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి గీతాంజలి మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో చుండూరి కిషోర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తణుకులో మహిళల నిరసనకు సంఘీభావం తెలుపుతున్న మంత్రి కారుమూరి



బుట్టాయగూడెంలో గీతాంజలి మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న దృశ్యం

## టీడీపీ, జనసేన వల్లే గీతాంజలి చనిపోయింది

**తణుకు అర్బన్:** టీడీపీ, జనసేన సామాజిక మాధ్యమాల్లో వేధించడం వల్లే తెనాలికి చెందిన గొల్తి గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడిందని తణుకు స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పొడుగు రామాచారి (రాము) అన్నారు. గీతాంజలి మృతికి బుధవారం తణుకు నరేంద్ర సెంటర్‌లో తణుకు స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ప్రభుత్వం తనకు దస్తావేజులతో కూడిన ఇంటిపత్రాలు ఇచ్చారని సంతోషంగా చెప్పిన విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన గీతాంజలిని ఆత్మహత్యకు పాల్పడేంతగా వేధించడం దారుణమని అన్నారు. ఏ రాజకీయ పార్టీని విమర్శించకుండా తనకు అందిన సౌకర్యాన్ని చెప్పుకున్నందుకు ఆమె చనిపోయేంతగా వేధిస్తారా అని నిలదీశారు. వేధింపులకు గురిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గొల్తి హరికృష్ణప్రసాద్, కోశాధికారి కొమ్మోజు రామకృష్ణ, ఉపాధ్యక్షులు టేకు రాజు, ధవళేశ్వరపు సుబ్బారావు, కోరుమిల్లి సుబ్బారావు, నాగమల్లి సాయి, తమిరి శివకుమార్, ఉప్పరాపల్లి బాలు పాల్గొన్నారు.



తణుకులో నిరసన తెలుపుతున్న స్వర్ణకార సంఘం నాయకులు



నడిపల్లి ప్రధాన రహదారిపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల రాస్తారోకో



రాఘవాపురంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

# దళితులకు అన్యాయం చేయాలని చేస్తే సహించం

**ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్**

**ఉండి:** దళితులకు ఎవరైనా అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని వాండ్రం గ్రామ శివారు వాండ్రంలంక ప్రాంతంలో శ్మశాన భూమి, రహదారి, పోరంబోకు స్థలాలను ఆక్రమణకు గురయ్యాయి అంటూ దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన వాండ్రంలంకలో పర్యటించారు. ఆయన వెంట ఆర్డీవో కే శ్రీనివాసులురాజు, తహసీల్దార్ కే శ్రీనివాస్, ఆకివీడు రూరల్ సీఐ కేవీఎస్ సత్యనారాయణ ఉన్నారు. దళితుల స్థలాలు, శ్మశాన భూమిని ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీల శ్మశాన భూమి, రహదారి, పోరంబోకు స్థలాలను ఆక్రమించుకున్న వ్యక్తి కేసు నమోదు చేయాలని ఆయన పోలీసులకు సూచించారు. అలాగే ఇంత జరుగుతున్నా స్పందించని గ్రామ పంచాయితీ కార్యదర్శి నాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్తీక్, వీఆర్వో చిన్నారావులను వెంటనే సస్పెండ్ చేసి వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు. దళితులకు ఇబ్బంది కలుగకుండా పోలీస్ పికెటింగ్ పెట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్నార్పీ అగ్రహారంలో శ్మశాన భూమి లేదంటూ స్థానికులు కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ మోనిటరింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ, చీకటిమిల్లి మంగరాజు, మాలమహానాడు నాయకులు నన్నేటి పుష్పరాజు, నేతల సువర్ణరాజు, తొర్లపాటి భాగ్యరాజు, మేడిద సాయిజగన్నాథ్, నేతల సాల్మన్‌రాజు, నన్నేటి నాగరాజు, నల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



వాండ్రం లంకలో దళితులు ఇచ్చిన వినతిపత్రాన్ని స్వయంగా అధికారులకు అందిస్తున్న ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్

### ఏలూరులో సోనోవిజన్ 3వ షోరూం ప్రారంభం



నగరంలో సోనో విజన్ షోరూం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** సోనోవిజన్ షోరూం వ్యాపార విస్తరణలో భాగంగా ఏలూరు నగరంలో 3వ షోరూం ప్రారంభించినట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ పొట్లూరి భాస్కరమూర్తి తెలిపారు. స్థానిక అంబికా దేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సోనోవిజన్ షోరూంను బుధవారం ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్ గృహోపకరణాలు నిత్యావసరాలుగా మారాయన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏలూరు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఈ ప్రాంతంలో ఆధునిక సోనో విజన్ షోరూంను ప్రారంభించామన్నారు. ఈ షోరూం ద్వారా ఈ ప్రాంత కొనుగోలుదారులకు అన్ని పెద్ద బ్రాండ్ల ఉపకరణాలు తక్కువ ధరలకు, నమ్మకమైన సర్వీసుతో, సున్నా శాతం వడ్డీతో అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌జీ, శ్యామ్‌సంగ్ సోనీ, లాయిడ్ ఓల్టాస్, హిటాచి, క్యారియర్, పానా సోనిక్, ఐఎఫ్‌బీ, బాట్, ఏసర్, గోద్రెజ్, విర్ల్‌పూల్, డైకిన్, ఐడీఎఫ్‌సీ కంపెనీల బ్రాంచ్ మేనేజర్లు, పాల్గొన్నారు.

### వృద్ధురాలిపై దాడి.. బంగారం అపహరణ

**పెంటపాడు:** ఏసీ మెకానిక్‌గా వచ్చిన వ్యక్తి వృద్ధురాలిని గాయపరచి ఆమె మెడలో ఉన్న బంగారు వస్తువులను అపహరించిన ఉదంతం ఇది. పెంటపాడు ఎస్సై జి.మోహనరావు తెలిపిన వివరాల ప్రకారం పరిమెళ్లకు చెందిన వృద్ధురాలు పెన్మెత్స వెంకట సూర్యాకాంతం (80) ఇంట్లో ఏసీ బాగు చేసేందుకు బుధవారం మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన ఏసీ మెకానిక్ ప్రసాద్ వచ్చాడు. ఇంట్లో ఇతరులు ఎవ్వరూ లేకపోవడం గమనించి ఆమె మెడలో ఉన్న బంగారు వస్తువును కాజేసేందుకు ప్రయత్నించాడు. వృద్ధురాలిని విచక్షణా రహితంగా కొట్టి గాయపరిచి మెడలో ఉన్న 14 కాసుల బంగారు ఆభరణాన్ని దొంగిలించి ఉడాయించాడు. తీవ్ర గాయాలపాలైన సూర్యాకాంతం తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

# పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా..

**ఏలూరు(మెట్రో) :** రానున్న ఎన్నికలలో జిల్లాలో ఏథికల్ ఓటింగ్ జరిగే విధంగా, పోలింగ్ శాతం పెంచే లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు జరుగుతున్నాయని స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. ఈదర సుబ్బమ్మదేవి నగర ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో ఓటుహక్కు వినియోగంపై ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించి భవిష్యత్తు ఓటర్లతో ఓటుహక్కు వినియోగంపై మాట్లాడారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో 79.77 శాతం రాష్ట్రంలో పోలింగ్ నమోదు కాగా ఏలూరు జిల్లాలో 83.75 శాతం నమోదైందన్నారు. జిల్లాలో అత్యల్పంగా ఏలూరు నియోజకవర్గంలో 68.10 శాతం ఓటింగ్ నమోదైందని, ఇది రాష్ట్ర సగటు కన్నా తక్కువని విద్యార్థులకు వివరించారు. దీనికి ప్రధాన కారణం పట్టణ ప్రాంతాల్లోని ఎగువ శ్రేణి వర్గం, యువత ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కాకపోవడమేనని అన్నారు. అందుకే రానున్న ఎన్నికలలో 92 శాతం ఓటింగ్ జరిగే విధంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఓటర్స్ టర్న్ అవుట్ ప్రణాళికను ఆమోదించారని దానిలో భాగంగా జిల్లాలో అన్ని ప్రాంతాలలో స్వీప్ కార్యక్రమాలు చేపడుతూ ఓటర్లను చైతన్య పరుస్తున్నామని డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ చెప్పారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులను, బంధువులను చైతన్య పరిచి ఓటుహక్కు వినియోగించుకునేలా సహకరించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ షరీఫ్, కె.లీలా ధరిణి, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

**ఒక్కరోజులో 40 వేల మంది విద్యార్థులతో స్వీప్ కార్యక్రమాలు**

జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో భవిష్యత్తు ఓటర్లు అయినా విద్యార్థులతో అవగాహనా కార్యక్రమాలు చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 191 జెడ్పీ స్కూళ్లలో, 7 మునిసిపల్ స్కూళ్లలో విద్యార్థులతో క్విజ్, ర్యాలీలు, మానవహారాలు తదితర కార్యక్రమాలు చేపట్టగా సుమారు 40 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. అలాగే వైద్య సిబ్బంది, 3500 మంది అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని ఓటర్ల భాగస్వామ్యంతో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, మానవహారాలు చేపట్టినట్లు వివరించారు.



చాణిక్యపురి కాలనీ కూడలిలో విద్యార్థుల మానవహారం

## ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో పుణ్యక్షేత్ర యాత్ర

**ఏలూరు (టూటౌన్):** భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ పుణ్యక్షేత్ర యాత్ర పేరుతో భారత్ గౌరవ్ టూరిస్టు రైలును నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా ఒక ప్రకటనలో తెలియజేశారు. పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా పూరి, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ పుణ్యక్షేత్రాలను సందర్శించే అవకాశం ఉందన్నారు. ఈ యాత్ర రైలు ఈ నెల 23 ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై తిరిగి 31వ తేదీ ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందన్నారు. విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట మీదుగా ఈ రైలు వెళుతుందని తెలిపారు. మొత్తం 8 రాత్రులు, 9 రోజులు యాత్ర సమయం ఉంటుందన్నారు. స్లీపర్ క్లాస్ టిక్కెట్ రేటు రూ.15,100, థర్డ్ ఏసీ టిక్కెట్ ధర రూ.24 వేలు, సెకండ్ ఏసీ టిక్కెట్ ధర రూ.31,400గా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎల్టీసీ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చునని చెప్పారు. పూర్తి వివరాలు, టిక్కెట్ల కొరకు తమ వెబ్‌సైట్‌ను గాని, ఐఆర్‌సీటీసీ విజయవాడ కార్యాలయం నందు గాని సంప్రదించాలని కోరారు.

### ప్రాణం తీసిన తెగిన విద్యుత్ తీగ



విద్యుదాఘాతంతో మృతి చెందిన దుర్గ

**పెదవేగి :** తెగిపడిన విద్యుత్ వైరు (కండక్టర్) మహిళ ఉసురు తీసింది. వేగంగా వ్యాపించిన మంటల్లో చూస్తుండగానే ఆ మహిళ క్షణాల్లో కాలి బూడిదైంది. పెదవేగి మండలం రామశింగవరంలో బుధవారం ఉదయం జరిగిన ఈ అనూహ్య సంఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శొంఠి శ్రీనివాసరావు, దుర్గ భార్యాభర్తలు. వారికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. ఆ దంపతులు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఉదయం సహచర కూలీలు పనికి వెళ్లిపోవడంతో దుర్గ వారిని చేరుకోవాలనే తొందరలో పొలాల నుంచి వెళ్తుండగా అప్పటికే తెగిపడిన విద్యుత్ వైరు ఆమెకు తగలడం, ఆ వెంటనే మంటలు చెలరేగి, చూస్తుండగానే దుర్గ(35) కాలి బూడిదైంది. సమీపంలోని పొలంలో ఉన్న రైతు ప్రమాదాన్ని పసిగట్టి, విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించి, ఆమెను కాపాడడానికి ప్రయత్నించగా, అప్పటికే అమె మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు.

# మోటార్‌సైకిళ్ల దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు



స్వాధీనం చేసుకున్న మోటార్‌సైకిళ్లు

**ఉంగుటూరు:** మోటార్‌సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న 5గురు యువకులను పోలీసులు చాకచక్యంగా పట్టుకుని వారి నుంచి రూ. 30 లక్షల విలువైన 25 లగ్జరీ మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఏలూరు డీఎస్పీ ఇ.వెంకటేశ్వర్లు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు సీఐ సుబాష్, ఎస్సైలు మణికుమార్ (చేబ్రోలు), వెంకటేశ్వరరావు (గణపవరం), ఆర్.శ్రీను(నిడమర్రు) సిబ్బందితో కలిసి కైకరం వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో నెంబరు ప్లేట్లు లేని ఒక మోటార్‌సైకిల్ మీద ఇద్దరు, మరో మోటార్‌సైకిల్ మీద ముగ్గురు కైకరం నుంచి వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు వెంబడించి పట్టుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరించారు. నిందితులు కైకరానికి చెందిన దొడ్డి లక్ష్మీనారాయణ, చిటికిన పవన్‌కుమార్, పుళ్లకు చెందిన సిద్ధాబత్తుల కార్తీక్, నారాయణపురానికి చెందిన పంతగాని లోకేష్, పి.నాగులుగా గుర్తించామని, వారు లగ్జరీ ఖర్చులకు అలవాటు పడి ఆ క్రమంలోనే దొంగతనాలకు పాల్పడ్డారని ఆయన తెలిపారు. ఏలూరు, పశ్చిమ, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో ఈ మోటారుసైకిళ్లు దొంగతనాలకు పాల్పడ్డారని, ఆయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని డీఎస్పీ చెప్పారు. ఈ సందర్భంగా దొంగలను పట్టుకున్న సీఐ, ముగ్గురు ఎస్సైలు, కానిస్టేబుళ్లను ప్రశంసించి రివార్డులు అంజేశారు. ఎస్పీ మేరీ ప్రశాంతి పోలీస్ సిబ్బందిని ప్రశంసించారని డీఎస్పీ వెంకటేశ్వరరావు వివరించారు.

### చెక్ అందజేత

**ఏలూరు(మెట్రో):** ఎస్ఆర్ఐ పేమెంట్ (ఇన్సూరెన్స్) చెక్కును బుధవారం కావ్యవల్లికి జేసీ లావణ్యవేణి అందజేశారు. పెదపాడు గ్రామానికి చెందిన తోట కావ్యవల్లి భర్త అనుపమ కుమార్ విదేశంలో గుండెపోటుతో మృతిచెందారు. తోట కావ్యవల్లికి భారత రాయబార కార్యాలయం నుంచి ఎస్ఆర్ఐ పేమెంట్ (ఇన్సూరెన్స్) కింద రూ.7,48,693 చెక్కు మంజూరైంది. ఈ చెక్కును జేసీ లావణ్యవేణి తన కార్యాలయంలో కావ్యవల్లికి అందజేశారు.

# సంక్షేమ సారథి సీఎం జగన్

ఇరగవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథి అని, సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఇరగవరం మండలంలోని ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో రూ.10 లక్షతో నిర్మించిన మీటింగ్, కత్తవపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో నిర్మించిన డ్వాక్రాభవనం, అంగన్‌వాడీ కేంద్రం, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం మంత్రి కారుమూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అర్హులందరికీ అందించారన్నారు. తణుకు నియోజకవర్గాన్ని రూ.3వేల కోట్లతో అభివృద్ధి చేశామని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలందరూ సుఖంగా ఉన్నారని తెలిపారు. కుల, మత, ప్రాంతాలను చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పరిపాలన అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, డీపీఎంఎస్ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, జవ్వాది సురేష్, ఎంపిడివో కె పద్మ జ్యోతి, ఎంపీటీసీ ఎం సత్యనారాయణ, సర్పంచ్ ఫణీంద్ర వరప్రసాద్ లక్ష్మీ, కార్యదర్శి కె శకుంతల, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

**సీఎం జగన్ హయంలో ఆలయాల అభివృద్ధి**

ఇరగవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయంలోనే ఆలయాల అభివృద్ధి జరుగుతుందని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఇరగవరం గ్రామంలో పాలేశ్వరస్వామి ఆలయంలో సీజీఎఫ్ నుంచి రూ.17లక్షలు, దాతల సహకారం రూ. 10లక్షలు, మంత్రి కారుమూరి విరాళం రూ. లక్షలు మొత్తం రూ. 27లక్షలతో నంది, అభిషేక మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి కారుమూరి మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా ఆలయాల అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థల దాతలు జవ్వాది హరిబాబు, జవ్వాది సుబ్బారావు, జవ్వాది ప్రకాష్, మెరిపె నాగేశ్వరావు, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, సొసైటి అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్, పంచముఖి హనుమద్ పీఠాధిపతి తంగిరాల ప్రదీప్ సిద్ధాంతి, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఎంపీటీసీలు మంగెన రామానాయుడు, పాలేశ్వరరావు, తంగిరాల గోపాల కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

## సమష్టి కృషితో దోమల నిర్మూలన


పట్టణంలో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కీటక జనిత వ్యాధులపై అవగాహన అవసరమని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలోని పాతూరులో దోమల నిర్మూలనపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల నిర్మూలనకు సమష్టి కృషి చేయాలన్నారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే చాలా వరకు వీటిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారానికి ఒక్కసారి డ్రై డే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మేరీ, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పార్టీ కార్యాలయంలో పందిరి రాటకు పూజాధికాలు


తణుకులో పందిరి రాట ఏర్పాటు చేస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం పందిరి వేసేందుకు రాట ముహూర్తం చేశారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యాలయానికి వచ్చే పార్టీ శ్రేణుల సౌకర్యార్థం రోడ్డు పొడవునా చలువ పందిర్లు వేసేందుకు పనులు చేపట్టారు. మంత్రి కారుమూరి ఈ రాట పాతేందుకు ముహూర్తం చేసి శాస్త్రోక్తకంగా పూజాధికాలు నిర్వహించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు ఉన్నారు.

### 90 మందికి థైరాయిడ్ పరీక్షలు


మోదుగ గుంట గ్రామంలో బాలికలకు థైరాయిడ్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మోదుగ గుంట, పుల్లాయగూడెం గ్రామాల్లోని ఆరు నుంచి 12 ఏళ్ల లోపు బాలబాలికలకు థైరాయిడ్ పరీక్షలు నిర్వహించినట్లు మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వీరవెంకటేష్ తెలిపారు. మొత్తం 90 మందికి పరీక్షలు చేసి, 18 మంది ఇళ్లకు వెళ్లి ఉప్పు, మూత్రం శాంపిల్స్ సేకరించినట్లు వివరించారు. వాటిని భీమవరం పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### వృద్ధాశ్రమానికి డైమండ్స్ విరాళం


చెక్కును అందజేస్తున్న పేరిచర్ల మురళీకృష్ణంరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో బుధవారం తిమ్మరాజుపాలెం వృద్ధాశ్రమానికి రూ. 5,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బండి వెంకటేశ్వరరావు, యశోధ కృష్ణ, గోలి చంద్రశేఖర్ రెడ్డి, కోనా హనుమాన్, జానికి రామ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించాలి


మాట్లాడుతున్న డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులకు ఇంటి వద్ద ప్రతి రోజు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయించాలని డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్ అన్నారు. స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల సెంటర్‌లో బుధవారం దివ్యాంగుల పిల్లలకు ఫిజియోథెరపీ చేయించారు. ఫిజియోథెరపీ వల్ల శారీరక సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిత ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యం, కేసు నమోదు

తణుకు: తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన వివాహిత కనిపించడంలేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన భోగది దయామణి దేవి సీఫుడ్స్ కర్మాగారంలో పని చేస్తున్నారు. గత కొంత కాలంగా ఆమె మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 10న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం గాలించినప్పటికీ కనిపించకపోవడంతో భర్త వెంకట దుర్గారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్ విచారణ చేస్తున్నారు.

# చిరుధాన్యాలతో పోషకాలు మెండు


తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమం దృశ్యం


తణుకు టౌన్: దువ్వలో జరిగిన పోషకాహార అవగాహనా ర్యాలీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: చిరుధాన్యాల్లో శరీరానికి కావలసిన పోషకాలు మెండుగా లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.ఎస్తేరు రాణి అన్నారు. బుధవారం మండలంలోని కుంచనపల్లి గ్రామంలో మిల్లెట్ ఆధారిత సాంప్రదాయ ఆరోగ్యకరమైన ఆహార పంటల ప్రదర్శన, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్తేరు రాణి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు తాము తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలన్నారు. తద్వారా పిల్లలకు, గర్భస్థ శిశువులకు బలవర్ధకమైన ఆహారం లభిస్తుందన్నారు. అనంతరం వైఎస్సార్ కిట్, పాలు వంటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కుంచనపల్లి గ్రామ మహిళా కార్యదర్శి అచ్చమ్మ, ఏఎన్ఎం ఆర్.దానమ్మ, అంగన్ టీచర్లు మంగ, కుమారి, సుబ్బాయమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలి**


అత్తిలి: తిరుపతిపురంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

అత్తిలి: గర్భిణీలు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను భుజించం ద్వారా తమ బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించగల్గుతారని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా తిరుపతిపురం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జి పార్వతి, బి లలిత, ఎస్ చంద్రిక, పి మాధవి తదితరులు పాల్గొన్నారు.

**పౌష్టికాహారంపై శ్రద్ధ వహించాలి**

తణుకు టౌన్: చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు కిషోరీ బాలికలకు పోషకాహారం పట్ల శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మి చెప్పారు. బుధవారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషకాహార పక్షోత్సవాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, బాలింతలు తమ ఆహారంలో మిల్లెట్లు అధిక శాతం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని డ్వాక్రా మహిళలు, ఆశ వర్కర్లు, ఇతర మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## 17నుంచి వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు


బల్లిపాడు మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: ఈనెల 17 నుంచి జరిగే అత్తిలి మండలం బల్లిపాడు మదనగోపాలస్వామి కల్యాణ మహోత్సవ ఆహ్వాన గోడ పత్రికను రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వైష్ణవ క్షేత్రాల్లో ప్రముఖమైన మదనగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దంపతులచే స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ తోట వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 19న రాత్రి స్వామివారి కల్యాణం, 20న తీర్ధ మహోత్సవం, రథోత్సవం, 21న రాత్రి పొన్నవాహన గ్రామోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బల్లిపాడు మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ ధనుమూరి తాతాజీ పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం


పైడిపర్రులో ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేస్తున్న ఇందుగపల్లి రామకృష్ణ

తణుకు టౌన్: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేరవేర్చారని పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ చెప్పారు. బుధవారం తణుకు పైడిపర్రులోని 25, 26, 27 వార్డు సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు జగనన్న కాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం అందజేసిన ఇంటి స్థలాలన్నీ మహిళల పేరుపై ఇచ్చి మహిళల్లో సాధికారతను పెంచారని చెప్పారు. ప్రతి పథకంలో మహిళలను మహారాణులుగా చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, నాయకులు కొత్తపల్లి చరణ్, కంచుమర్తి విశ్వేశ్వరరావు, త్రినాథ్, సానబోయిన ప్రసాద్, నిమ్మకాయల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీయిజాన్ని ఓడిద్దాం..అభివృద్ధిని గెలిపిద్దాం..

**కూటమిపై మంత్రి కొట్టు ఘాటు వ్యాఖ్యలు**

తాడేపల్లిగూడెం అర్బన్ : రౌడీయిజాన్ని ఓడిద్దాం.... అభివృద్ధిని గెలిపిద్దాం... అంటూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెంలో జనసేనను బ్లేడ్ బ్యాచ్ అంటూ ఘాటుగా విమర్శించారు. బ్లేడ్ బ్యాచ్ నేడు బ్యానర్లు కత్తిరిస్తుంది, రేపు జేబులు కత్తిరిస్తుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలను ఉద్దేశించి మంత్రి కొట్టు మాట్లాడారు. 2004లో తాను ఎమ్మెల్యే కావడానికి ముందు పట్టణంలో రౌడీ మూకలు పేట్రేగిపోయిన రోజులను గుర్తు చేశారు. రౌడీలు, గుండాలు, సెటిల్మెంట్ గ్యాంగులు, అల్లరి మూకలు, పోకిరీలు పట్టణంలో అశాంతి, అలజడులను సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే తాను ఉక్కు పాదంతో అణచివేశానని ఉద్ఘాటించారు. మళ్లీ ఇప్పుడు ఆ అసాంఘిక శక్తులు రాజకీయాల్లోకి వచ్చి చెలరేగిపోయేందుకు సిద్ధపడుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొట్టు హెచ్చరించారు. ఓటు అనే వజ్రాయుధం ద్వారా అలాంటి దుష్టశక్తులను గట్టిగా తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2004 నుంచి 2009 వరకు తాను ఎమ్మెల్యేగా ఉండగా జరిగిన అభివృద్ధి తప్ప ఆ తర్వాత వచ్చిన వారు పదేళ్ల నియోజకవర్గాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. మళ్లీ తాను 2019లో రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నానని తెలియజేశారు. ప్రతి వార్డులోనూ కోట్ల రూపాయలు వెచ్చించి సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు తాగునీటి సరఫరా పైపులైను పనులు వంటివి పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని మంత్రి కొట్టు తెలియజేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్న, నియోజకవర్గంలో అభివృద్ధి ముందుకు వెళ్లాలన్న మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆయన కోరారు. అక్కడ ముఖ్యమంత్రిగా జగనన్న, ఇక్కడ ఎమ్మెల్యేగా తాను కొనసాగితేనే అభివృద్ధి, సంక్షేమం ముందుకు సాగుతాయన్నారు. తాను ఉండగా రౌడీలు, గుండాలు, సెటిల్మెంట్ గ్యాంగులు, పేకాట రాయుళ్లు, అల్లరి మూకలు చేష్టలు సాగనివ్వనని గట్టిగా హెచ్చరించారు. సమాజంలో అన్ని వర్గాలు ప్రశాంతమైన జీవితం గడిపేలా శాంతిభద్రతలు కాపాడుతానన్నారు. మహిళలకు రక్షణ కల్పిస్తానన్నారు.

## న్యాయమూర్తి నక్కా అజయ్‌కుమార్‌కి సత్కారం


నక్కా అజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు కామేష్, న్యాయవాదులు

తణుకు అర్బన్: నిడదవోలు సెకండ్ క్లాస్ బెంచ్‌కోర్టు మేజిస్ట్రేట్ నక్కా అజయ్‌కుమార్‌ను తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. తణుకు అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ తణుకు బార్ అసోసియేషన్‌లో సభ్యుడై న్యాయవాదిగా సేవలందించిన నక్కా అజయ్‌కుమార్ మేజిస్ట్రేట్ బాధ్యతలు అందుకోవడం తణుకు బార్ అసోసియేషన్ అంతా గర్వపడుతున్నామని, భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యదర్శి మూర్తి, ఉపాధ్యక్షుడు చింతపల్లి నాగేశ్వరరావు, కత్తుల జెస్‌పాల్, పొట్ల సురేష్ పాల్గొన్నారు.

## వేల్పూరు రోడ్డుకు పొట్టి శ్రీరాములు వీధిగా నామకరణం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి, చిత్రంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు

తణుకు అర్బన్: ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో బుధవారం ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన మంత్రి కారుమూరి విలేకర్లతో మాట్లాడారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం పొట్టి శ్రీరాములును గౌరవించుకోవాలనే మంచి ఉద్దేశ్యంతో తణుకులో వేల్పూరు రోడ్డును ఇకపై పొట్టి శ్రీరాములు వీధిగా మార్పించామని అన్ని అనుమతులు వచ్చాయని చెప్పారు. రెండు రోజుల్లో ఆ వీధి మొదట్లో వీధి పేరు తెలిపే విధంగా బోర్డు, శిలాఫలకం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు మానేపల్లి శ్రీనివాస్, ఆర్యవైశ్య ప్రముఖులు గమిని రాజా, నూలి సత్యనారాయణ మాట్లాడుతూ మా ఆర్యవైశ్యులను గుర్తించి మా ఆరాధ్యదైవం పొట్టి శ్రీరాములు పేరును ప్రధాన వీధికి నామకరణం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మా ఈ కోరిక ఏళ్ల తరబడి ఉందని మంత్రిగా కారుమూరి మాకు ఈ గౌరవాన్ని కల్పించినందుకు ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు రాజేష్‌నాథ్ అఘోరి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మాజేటి ప్రకాష్, నార్కెడిమిల్లి రామకృష్ణ, జల్లూరి జగదీష్ పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


పెంటపాడు 10వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న నాయకులు

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ద్వారానే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ దాసరి హైమావతి, పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళలు పేర్కొన్నారు. పెంటపాడులో సమారు రూ. 20 లక్షల నిధులతో రోడ్లు, డ్రెయిన్‌లు తాగునీటి అభివృద్ధి పనులకు పెంటపాడులో శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడో ఓహెచ్‌ఆర్ ఫిల్టర్‌బెడ్ క్లీనింగ్ నిమిత్తం ఎంపీపీ గ్రాంట్ ద్వారా రూ. 7 లక్షలు, 10 వార్డులో 380 మీటర్ల డ్రెయిన్ నిర్మాణానికి రూ. రూ.7 లక్షలు, మరో పని నిమిత్తం పంచాయతీ గ్రాంట్ నుంచి రూ. 3 లక్షలు ఖర్చుతో చేపట్టబోయే పనులకు ఎంపీపీ, సర్పంచ్‌లు శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి సూచనల మేరకు గ్రామాల అభివృద్ధి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి, వార్డు సభ్యులు బర్ల జయరాంబాబు, కాసారపు శ్రీను, రెడ్డి శ్రీను, ఎస్సీ నాయకులు దేవాబత్తుల బాబి, తాడేపల్లి ఈశ్వరరావు, ఉండ్రాజవరపు గోపి, మారంపూడి ఏసుదాసు, పార్టీ నాయకులు అంజిరెడ్డి, బండారు రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్లు కర్రి వరహాలరెడ్డి, సలుమూరి ప్రకాష్, కె. పెంటపాడు రాజు, తదితరులు పాల్గొన్నారు.

### పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెంటపాడు: విద్యార్థులు భయం వీడి పదోతరగతి పరీక్షలకు సిద్ధం ఉండాలని పెంటపాడు ఎంఈవో ఎం. శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన మండలంలో పదోతరగతి పరీక్షలు జరిగే కేంద్రాలను పరిశీలించారు. 454 మంది బాలికలు, 462 మంది బాలురు, మొత్తం 916 మంది పరీక్షలు రాస్తారన్నారు. పెంటపాడులోమొత్తం 5 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### ఆదికవి విశ్వ విద్యాలయంలో జాతీయ సదస్సు

తాడేపల్లిగూడెం: ఆదికవి నన్నయ యూనివర్శిటీలో క్యాంపస్, ఫిజిక్స్ డిపార్టుమెంట్, నానో టెక్నాలజీ, బయో మెడికల్ ఉత్తేజపరిచే బుధవారం ఒక రోజు జాతీయ సదస్సు సెమినార్ నిర్వహించారు. ఇంటర్ డీసీప్లీనరీ రంగాలలో అత్యాధునిక పురోగతిని అన్వేషించే లక్ష్యంతో జరిగిన సెమినార్‌లో అధ్యాపకులు, విద్యార్థులు హాజరైయారు.

## రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


తణుకులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకుకు చెందిన 11 సంవత్సరాల చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు బుధవారం రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఖరీదైన వైద్యసేవలు పొందినందుకు ఈ మొత్తాన్ని అందజేశామని వివరించారు. చిన్నారి తండ్రి పెంట నరేష్ మాట్లాడుతూ తన కుమారుడు మోక్షిత్ తీవ్ర అనారోగ్యానికి గురై అత్యవసర వైద్యం చేయాల్సి వచ్చిందని మంత్రి కారుమూరిని కలవగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రూ.10 లక్షలు మంజూరు చేయించారని చెప్పారు. కుమారుడి వైద్యానికి సహకరించిన మంత్రి కారుమూరికి రుణపడి ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షులు వీరమల్లు ఫణీంద్రకుమార్, నాయకులు నార్గన సత్యనారాయణ, కారుమంచి మిత్ర పాల్గొన్నారు.

### ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్ పేపర్–2, ఎకానమిక్స్ పేపర్–2 పరీక్షలు బుధవారం తాడేపల్లిగూడెం 5 సెంటర్‌లలో ప్రగతి, జీఎంఆర్, ఆదిత్య, వాసవి, గోయంకా ఉమన్స్ కళాశాలలో నిర్వహించారు. పరీక్షలకు 1,660 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,625 మంది పరీక్షలకు హాజరైయారు. 35 మంది పరీక్షలకు హాజరు కాలేదు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రతినిధులు వెల్లడించారు.